క్లుప్తంగా

నవంబర్ 9న 'ఆర్‌ఆర్‌డీఎస్' స్వర్ణోత్సవం



ఆర్‌ఆర్‌డీఎస్ కళాశాల స్వర్ణోత్సవాలకు విరాళం చెక్కును అందిస్తున్న దృశ్యం

సాక్షి, భీమవరం: పట్టణంలోని ఆర్‌ఆర్‌డీఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల స్వర్ణోత్సవం, రాజా రామ్మోహన్‌రాయ్ ద్విశత జయంతి స్వర్ణోత్సవాన్ని నవంబర్ 9న నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ వీకేజే ప్రసూన సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. అన్ని వర్గాల సహకారంతో స్వర్ణోత్సవాలను నిర్వహించనున్నామని, దీనికిగాను ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేశామన్నారు. ఉత్సవాలకు స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు చెరుకువాడ రంగసాయి, ఇందుకూరి ప్రసాదరాజు, బీహెచ్ వెంకటపతి రాజు ఆధ్వర్యంలో వేడుకలను నిర్వహిస్తున్నామన్నారు. వేడుకల సందర్భంగా వసుధ ఫౌండేషన్ రూ.10 వేలు విరాళంగా అందించినట్లు పేర్కొన్నారు.

పేద విద్యార్థులకు ఆర్థిక సాయం



ఓ విద్యార్థినికి నగదు అందిస్తున్న దృశ్యం

ఆకివీడు: పేద విద్యార్థులకు ఆర్థిక ప్రోత్సాహం అందించడం అభినందనీయమని సర్పంచ్‌ల చాంబర్ జిల్లా అధ్యక్షురాలు గాలి సామ్రాజ్యం అన్నారు. అయిభీమవరం జెడ్పీ ఉన్నత పాఠశాలలో 6, 7 తరగతి విద్యార్థినులు ఇద్దరికి రూ.2,500 చొప్పున, 8, 9, 10 విద్యార్థులు ముగ్గురికి రూ.5 వేలు చొప్పున ఆర్థిక సహాయాన్ని కెనరా బ్యాంక్ విద్యాజ్యోతి నుంచి మంగళవారం అందజేశారు. ఈ సందర్భంగా సామ్రాజ్యం మాట్లాడుతూ విద్యార్థులు ఇష్టపడి చదవాలన్నారు. పేద విద్యార్థులు చదువుకునేందుకు ప్రభుత్వం ప్రవేశపెట్టిన అమ్మ ఒడి, ఫీజు రీయింబర్స్‌మెంట్, విద్యా దీవెన, విద్యా వసతి వంటి పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కెనరా బ్యాంక్ బీఎం ఏవీఎస్ శర్మ, బ్యాంక్ అధికారులు, హెచ్‌ఎం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పందిరి రాట ఏర్పాటు



పందిరి రాట నాటుతున్న దృశ్యం

భీమవరం (ప్రకాశంచౌక్): పట్టణంలోని ఇందిరమ్మ కాలనీ 12వ వార్డులో దేవీ నవరాత్రి ఉత్సవాల సందర్భంగా సోమవారం పందిరి రాటకు పూజలు నిర్వహించి ఉత్సవాల ఏర్పాట్లను ప్రారంభించారు. ఈ సందర్భంగా కాలనీ ఇన్‌చార్జి, పట్టణ రజక సంఘం అధ్యక్షుడు చింతాడ శ్రీనివాస్ మాట్లాడుతూ ఉత్సవాల్లో భాగంగా వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని, దీనిలో భాగంగా గానగంధర్వుడు పిప్పళ్ల ప్రసాద్ సాయి సంకీర్తనలు, భజనలు, ముగింపు రోజు అన్నదానం , అమ్మవారి ఊరేగింపుతో కార్యక్రమాలు ముగుస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో జడ్డు ఏడుకొండలు, తోట సతీష్, తోట సురేష్, నరసింహారావు, జడ్డు శ్రీను, పేరూరి దుర్గారావు, చింతాడ నాగలక్ష్మి పాల్గొన్నారు

సచివాలయ సర్వేయర్ ఆత్మహత్య

గణపవరం: గణపవరం మండలం జల్లికాకినాడకి చెందిన సచివాలయ సర్వేయర్ అద్దేపల్లి వెంకటలక్ష్మీ దుర్గారావు (27) ఆదివారం రాత్రి ఇంటి వద్ద ఫ్యానుకు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడినట్లు గణపవరం ఎస్సై వెంకటేశ్వరరావు తెలిపారు. ఈయన ఉండి మండలం కోలమూరు గ్రామ సచివాలయంలో సచివాలయ సర్వేయర్‌గా పనిచేస్తున్నారు. ఇతను అవివాహితుడు. ఆదివారం సెలవు కావడంతో ఇంటి వద్దనే ఉన్న దుర్గారావు అర్ధరాత్రి దాటిన తర్వాత వంట గదిలో ఫ్యానుకు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. కుటుంబ సభ్యులంతా నిద్రిస్తున్న సమయంలో ఆయన ఈఘాతుకానికి పాల్పడ్డాడు. అర్ధరాత్రి 1 గంట సమయంలో లేచిన తల్లి దుర్గారావు ఫ్యానుకు వేలాడుతుండటం చూసి ఇంట్లో వారిని నిద్రలేపింది. కుటుంబ సభ్యులు దుర్గారావును కిందికి దింపగా అప్పటికే మృతి చెందాడు. ఆత్మహత్యకు కారణాలు తెలియాల్సి ఉంది. తండ్రి నాగేశ్వరరావు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

నాలుగు నెలల క్రితమే విధుల్లోకి..

ఉండి: కోలమూరు సచివాలయంల సర్వేయర్ అద్దేపల్లి దుర్గారావు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడటంతో సహచర ఉద్యోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆదివారం సహోద్యోగులతో ఉత్సాహంగానే గడిపిన దుర్గారావు బలవన్మరణానికి పాల్పడటం బాధాకరంగా ఉందని అంటున్నారు. గణపవరం మండలం జీ కొండేపాడులో ఉద్యోగ బాధ్యతలు చేపట్టిన దుర్గారావు నాలుగు నెలల క్రితమే కోలమూరు సచివాలయానికి బదిలీ అయ్యారు.

పేదల ఆరోగ్య సంరక్షణే లక్ష్యం



కోళ్లపర్రులో మందులు పంపిణీ చేస్తున్న కేశిరెడ్డి మురళీ, నంద్యాల సీతారామయ్య, మోరా జ్యోతి

ఆకివీడు: పేదల ఆరోగ్య సంరక్షణే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అనేక కార్యక్రమాలు అమలు చేస్తున్నారని త్రిసభ్య కమిటీ చైర్మన్ కేశిరెడ్డి మురళీ, మండల వ్యవసాయ సలహా కమిటీ చైర్మన్ నంద్యాల సీతారామయ్య, మెప్మా అధ్యక్షురాలు మోరా జ్యోతి అన్నారు. మండలంలోని కోళ్లపర్రు గ్రామ సచివాలయంలో సోమవారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరంలో వారు మాట్లాడారు. వైద్యం కోసం దూర ప్రాంతాలకు వెళ్లలేక, అధిక సొమ్ము చెల్లించి ప్రైవేట్ ఆసుపత్రుల్లో వైద్యం చేయించుకోలేని నిరుపేదలకు వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పథకం ద్వారా ప్రభుత్వం అండగా నిలిచి మెరుగైన వైద్యం అందిస్తోందన్నారు. ఆరోగ్యశ్రీ ద్వారా రాష్ట్రంలో 3,255 వ్యాధులకు ఉచిత వైద్య సేవలు, శస్త్రచికిత్సలు అందజేస్తున్నారని చెప్పారు. ఆరోగ్య శ్రీ పథకాన్ని మరింత బలోపేతం చేసేందుకు, ప్రభుత్వ ఆసుపత్రులను అభివృద్ధి పరచేందుకు సీఎం వైఎస్ జగన్ చిత్తశుద్ధితో పనిచేస్తున్నారన్నారు. వైద్య శిబిరంలో 680 మందికి ఓపీ పరీక్షలు నిర్వహించారు. అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ కందుల వాణీ, వైఎస్సార్ సీపీ గ్రామ అధ్యక్షుడు పాశం నర్సింహారావు, కేశిరెడ్డి వాసు, దింటకుర్తి నాగేశ్వరరావు, మండల పరిషత్ కోఆప్షన్ సభ్యుడు పిల్లి షద్రక్, సర్పంచ్ ఎన్.రామరాజు తదితరులు పాల్గొన్నారు.

ప్రతి కుటుంబానికీ వైద్య సేవలు

కాళ్ల: జగనన్న ఆరోగ్య సురక్ష ద్వారా ప్రతి కుటుంబ ఆరోగ్యంగా ఉంటుందని మండల అధికారులు తెలిపారు. కోపల్లె గ్రామంలోని జెడ్పీ హైస్కూల్‌లో సోమవారం జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో స్వాతి మాట్లాడుతూ ప్రతి కుటుంబం ఆరోగ్యంగా ఉండాలని ఆలోచనతో ప్రభుత్వం ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ప్రవేశపెట్టిందన్నారు. ఈ అవకాశాన్ని గ్రామంలోని ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరంలో ప్రత్యేక వైద్య నిపుణులు



కోపల్లెలో అంగన్‌వాడీలు తయారుచేసిన ఆహారాన్ని పరిశీలిస్తున్న ఎంపీడీవో స్వాతి

రోగులకు వైద్య పరీక్షలు చేశారు. అనంతరం అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు. వైద్యులు గులాబీ రాజ్‌కుమార్, గ్రామ ఉప సర్పంచ్ బుడి వెంకటపరాలు, పంచాయతీ కార్యదర్శి బాలకృష్ణ, అంగన్‌వాడీ టీచర్లు, ఆశ వర్కర్లు, పంచాయతీ అధికారులు పాల్గొన్నారు.

జగనన్న సురక్షతో ఆరోగ్య భాగ్యం

ఉండి: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ద్వారా గ్రామీణ ప్రజలకు ఆరోగ్య భాగ్యం కలిగిందని కోలమూరు గ్రామ సర్పంచ్, ఉపసర్పంచ్‌లు నడింపల్లి సత్యవతి, నడింపల్లి రామకృష్ణంరాజు అన్నారు. కోలమూరు గ్రామంలో సర్పంచ్, ఉప సర్పంచ్, వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకులు గం



కోలమూరులో ఓ మహిళకు మందుల కిట్‌ను అందిస్తున్న దృశ్యం

డ్రాజు రాజేష్‌వర్మ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన జగనన్న సురక్ష వైద్య శిబిరంలో వందలాది మంది రోగులు ఉచిత వైద్య సేవలు పొందారు. సూపర్ స్పెషాలిటీ డాక్టర్ నీలాద్రిరాజు ఆధ్వర్యంలో ప్రత్యేక వైద్య సేవలను అందించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశంలో నాయకులు మాట్లాడుతూ ప్రతి ఇంటికీ మెరుగైన వైద్య సేవలు అందించేందుకే జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం అమలు చేస్తోందన్నారు. వేలాది రూపాయల ఖర్చయ్యే వైద్య సేవలను గ్రామీణ ప్రజలకు ఉచితంగా అందించడంతో వారంతా హర్షాతిరేకాలు వ్యక్తం చేస్తున్నారన్నారు. సాధారణ వైద్య సేవలతో పాటు కంటి చికిత్స, గుండె, ఎముకలు, గర్భిణులు, చిన్నారులకు వైద్య సేవలు అందించడంతో ప్రజలంతా హాయిగా వైద్య శిబిరాలకు వచ్చి వైద్య సేవలు పొందుతున్నారన్నారు. అలాగే 56 పరీక్షల ద్వారా 500 పైబడి రోగాలను నిర్ధారణ చేసేందుకు వైద్య శిబిరంలోనే టెస్టులు నిర్వహించడం మరింత సంతోషంగా ఉందన్నారు. అనంతరం వైద్య శిబిరంలో ప్రత్యేక వైద్యులు రోగులకు వైద్య పరీక్షలు చేసి మందుల కిట్‌లను పంపిణీ చేశారు. ఎంపీటీసీ సభ్యులు పేరిచర్ల అరుణభార్గవి, డాక్టర్ నీలాద్రిరాజు, వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకులు గండ్రాజు రాజేష్‌వర్మ, మండల ప్రత్యేకాధికారి ఎం.రవికుమార్, గ్రామ పార్టీ అధ్యక్షుడు పేరిచర్ల కేశవరాజు, కార్యదర్శి శంకరం తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణమే లక్ష్యం

వీరవాసరం: ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణమే వైఎస్సార్ సీపీ ప్రభుత్వ లక్ష్యమని నవుడూరు సర్పంచ్ నల్లమిల్లి రేణుక అన్నారు. నవుడూరు గ్రామ సచివాలయం పరిధిలో సోమవారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అభివృద్ధి, సంక్షేమంతో బాటు ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బృహత్తర కార్యక్రమాన్ని చేపట్టారని వివరించారు. ఇంటింటికి తిరిగి వైద్య సిబ్బందితో సర్వేలు నిర్వహించి, ఎవరికి ఏ వైద్యం అవసరమో గుర్తించి, వారికి ప్రత్యేక చికిత్సలు నిర్వహించడానికి చర్యలు తీసుకోవడం అభినందనీయమన్నారు. నవుడూరు గ్రామ సచివాలయ-1 పరిధిలోని సుమారు 550 మందికి పైగా ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించి, మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో జేసీఎస్ కన్వీనర్ మానుకొండ ప్రదీప్ కుమార్, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ కడలి ధర్మారావు, దేవిరెడ్డి గోపాలకృష్ణ, యాళ్లబండి ఏడుకొండలు, బొట్టా సుందరరావు, బొల్లింపల్లి వెంకయ్య, కొడే అప్పారావు, వీరవల్లి శ్రీనివాస్, చింతపల్లి కొండా, పి.జ్యోతి, సుజాతరాణి, దుర్గాప్రసాద్, వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

పొలంలో రైతుకు వైద్య పరీక్షలు



సిద్ధాపురంలో వరి పొలంలో రైతుకు వైద్య పరీక్షలు చేస్తున్న ఏఎన్‌ఎం లక్ష్మి

ఆకివీడు: జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో భాగంగా ఇంటింటికీ వెళ్లి వైద్య పరీక్షలు నిర్వహిస్తుంటే కొంతమంది రైతులు అందుబాటులో లేకపోవడంతో వారు ఎక్కడ ఉంటే అక్కడికే సిబ్బంది వెళ్లి వైద్య సేవలందిస్తున్నారు. సిద్ధాపురం గ్రామంలో ఇంటింటా సర్వే పూర్తి చేస్తున్న తరుణంలో కొంత మంది రైతులు అందుబాటులో లేకపోవడంతో సోమవారం వారి పొలాల వద్దకు ఏఎన్‌ఎం మాదాబత్తుల వెంకటలక్ష్మి వెళ్లి అక్కడ వైద్య పరీక్షల్ని నిర్వహించారు. రైతులు నామగిరి దామోదరరావు, బొడ్డి చెర్ల రాముడుకు బీపీ, సుగర్ పరీక్షలు చేశారు. ఈ సందర్భంగా ఏఎన్‌ఎం మాట్లాడుతూ ఈ నెల 10న గ్రామంలో జగనన్న ఆరోగ్య సురక్ష మెగా వైద్య శిబిరం నిర్వహిస్తున్నామని, క్యాంపు సమయానికి ప్రతి వ్యక్తికీ ప్రాథమిక వైద్య సేవలు అందించడంలో భాగంగా పొలం గట్లకు వెళ్లాల్సి వచ్చిందన్నారు. వైద్య పరీక్షలకు గ్రామ సర్పంచ్ చిగురుపాటి చిట్టిబాబు, గ్రామ ఉప సర్పంచ్ ఇందుకూరి నారాయణరాజు సహకరించారని ఏఎన్‌ఎం తెలిపారు.

కాళ్లకూరులో సప్తనదీ జలాభిషేకాలు ప్రారంభం



ప్రత్యేక అలంకరణలో స్వామివారు, అమ్మవార్లు



స్వామివారికి పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

కాళ్ల: కాళ్లకూరులో వేంచేసియున్న స్వయంభూః శ్రీవేంకటేశ్వర స్వామివారి దేవస్థానంలో సోమవారం సాయంత్రం సప్తనదీ జలాభిషేకాలు ప్రారంభమయ్యాయి. వేద మంత్రోచ్చారణలతో ఆలయ అర్చకులు, వేద పండితులు శ్రీఫణికుమార్ శర్మ, శ్రీవెంకటరమణ ఆచార్యత్వంలో శ్రీస్వామివారి వారికి సప్తనదీ జలాభిషేక పూర్వక పవిత్రోత్సవాలు ఘనంగా నిర్వహించారు. ముందుగా శ్రీ స్వామివారిని ఆలయ ప్రదక్షిణం గావించి విష్వక్సేన పూజ, పుణ్యాహవాచనం, అంకురార్పణ, ఋత్విక్ వరుణ, దీక్షాధారణ, యాగశాల ప్రవేశం, నీరాజనం మంత్రపుష్పములు, తీర్థ గోష్ఠి, ప్రసాద వితరణ కార్యక్రమాలు జరిపారు. ఈ కార్యక్రమానికి దేవస్థానం ధర్మకర్తల మండలి అధ్యక్షుడు దండు వెంకట కృష్ణంరాజు, ధర్మకర్తల మండలి సభ్యులు, పెద్ద ఎత్తున భక్తులు, గ్రామస్తులు పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. దేవస్థానం కార్యనిర్వహణాధికారి మోకా అరుణ్ కుమార్ మాట్లాడుతూ ఈ నెల 14వ తేదీ వరకు ఈ కార్యక్రమాలు కొనసాగుతాయన్నారు.

తపాలా శాఖ వారోత్సవాలు ప్రారంభం

భీమవరం (ప్రకాశంచౌక్): పట్టణంలోని హెడ్ పోస్ట్ ఆఫీస్‌లో శ్రీవిజ్ఞానవేదిక, తపాలా శాఖ సంయుక్త అధ్వర్యంలో వారోత్సవాలను ఆదివారం ప్రారంభించారు. సీనియర్ పోస్టల్ సూపరింటెండెంట్ పి.సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ బ్రిటిష్ కాలం నుంచి తపాలా శాఖ అమలులో ఉందన్నారు. హెడ్ పోస్ట్‌మాస్టర్ ఎస్ఎన్ రామాచార్యులు మాట్లాడుతూ ఈనెల 16 వరకు ఈ వారోత్సవాలు నిర్వహిస్తున్నామని, పోస్టల్ సంక్షేమ పథకాలు, ఇన్సూరెన్స్‌లపై అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తామని తెలిపారు. నిర్వాహకులు చెరుకువాడ రంగసాయి మాట్లాడుతూ పోస్టల్ శాఖ సహకారంతో ఈ వారోత్సవాల్లో స్టాంపుల ప్రదర్శన, విద్యార్థులకు వివిధ పోటీలు నిర్వహిస్తామన్నారు. గెలుపొందిన వారికి ముగింపు వేడుకల్లో బహుమతులు అం



వారోత్సవాల పోస్టర్‌ను ఆవిష్కరించిన దృశ్యం

దజేస్తామని, ఉత్తమ పోస్ట్‌మెన్‌లకు సత్కారం చేస్తామన్నారు. పోస్టల్ డిప్యూటీ సూపరింటెండెంట్ అల్లు సురేష్, లయన్స్ జోన్ చైర్మన్ నందమూరి రాజేష్, అరసవల్లి సుబ్రహ్మణ్యం, భట్టిప్రోలు శ్రీనివాసరావు, గంటా సుందర్ కుమార్ పాల్గొన్నారు.

మాలధారులకు ఉచిత భిక్ష ప్రారంభం

ఆకివీడు: మాలధారులందరికీ ఉచితంగా అల్పాహారం, భోజన వసతిని ప్రముఖ రైస్ మిల్లర్ కొటికలపూడి వెంకట సూర్యనారాయణ స్వామి సోమవారం ప్రారంభించారు. కుప్పనపూడికి చెందిన నూకల రామదాసు గురుస్వామి ఆధ్వర్యంలో మాలధారులకు ఆరేళ్లుగా ఉచిత భోజన వసతి కొనసాగిస్తున్నారు. ప్రతి రోజూ ఉదయం 11.30 గంటల నుంచి అల్పాహారం, భిక్ష అందిస్తున్నారు. సూర్యనారాయణ మాట్లాడుతూ చుట్టుపక్కల గ్రామాలు, పక్క జిల్లా నుంచి అధిక సంఖ్యలో మాలధారులు వచ్చి ఇక్కడ భిక్ష స్వీకరిస్తున్నారన్నారు. నిర్వాహకులు రామదాసు మాట్లాడుతూ సోమవారం నుంచి డిసెంబర్ 20వ తేదీ వరకు ఉచిత అల్పాహారం, భిక్షను మాలాధారులకు అందజేస్తున్నట్లు తెలిపారు. దాతల సహకారంతో, సొంత ఖర్చులతోనూ



కుప్పనపూడిలో భిక్షను ప్రారంభించిన దృశ్యం

అయ్యప్ప, భవానీ, వేంకటేశ్వరస్వామి, శివ మాలాధారులందరికీ భోజన వసతిని స్వాముల కరుణకటాక్షాలతో కొనసాగిస్తున్నట్లు చెప్పారు. ప్రారంభోత్సవ కార్యక్రమంలో స్థానికులు ముత్యాల రత్నం, గురుస్వామి నీలకంఠం, చుండూరి నరేంద్ర, నాగేంద్ర పాల్గొన్నారు.

'స్ఫూర్తి' ప్రతిభా పురస్కారాల అందజేత

ఉండి: ఈ ఏడాది పదో తరగతి పరీక్షల్లో పాఠశాల, మండల స్థాయిలో ప్రతిభ చూపిన విద్యార్థులకు స్ఫూర్తి ఫౌండేషన్ ప్రతిభా పురస్కారాలను అందజేసింది. హెచ్‌ఎం ఎంవీ సత్యనారాయణ ఆధ్వర్యంలో సోమవారం ఎన్నార్పీ అగ్రహారం జెడ్పీ హైస్కూల్‌లో నిర్వహించిన ప్రతిభా పురస్కారాల కార్యక్రమంలో నగదు బహుమతులను అందజేశారు. మండల స్థాయిలో తెలుగు, ఇంగ్లిష్ మీడియంలో ప్రథమస్థానంలో నిలిచిన విద్యార్థులు యు.హర్షిత, ఎ.మేరీరత్నం, ప్రోత్సాహక బహుమతిగా కే.ఆగ్నేస్‌లకు రూ.5 వేల చొప్పున నగదు బహుమతులను నిర్వాహకులు అందజేశారు. అలాగే వివిధ స్కూల్ స్థాయిలో ప్రథమస్థానంలో నిలిచిన వారికి రూ.2 వేలు, ద్వితీయస్థానంలో నిలిచిన వారికి రూ.1500 చొప్పున అందజేశారు.



పురస్కారాలు పొందిన విద్యార్థులతో ఉపాధ్యాయులు

ఎంఈవోలు బీ జ్యోతి, బీ వినాయకుడు, హెచ్‌ఎంలు కృష్ణంరాజు, చక్రవర్తి, రవీంద్ర, రామలక్ష్మీ, రత్నకుమార్, ఉపాధ్యాయులు సుబ్బరాజు, సునీల్‌కుమార్, ఛాముండేశ్వరీ పాల్గొన్నారు.

విజయవాడ తరలిన వైఎస్సార్ సీపీ ప్రజాప్రతినిధులు

ఆకివీడు: విజయవాడ మునిసిపల్ స్టేడియంలో జరిగిన వైఎస్సార్‌సీపీ రాష్ట్ర స్థాయి సమావేశం విజయవంతమైందని జెడ్పీటీసీ సభ్యులు వేగేశ్న వెంకట్రాజు(యండగండి శ్రీను), నగర పంచాయతీ చైర్‌పర్సన్ జామి హైమావతి చెప్పారు. సోమవారం సాయంత్రం వారు స్థానిక విలేకరులతో మాట్లాడారు. సభలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రసంగం తమ మనస్సుల్ని హత్తుకుందన్నారు. రానున్న ఎన్నికల్లో సంక్షేమ పథకాలపై ప్రజలకు మరింతగా వివరించి, లబ్ధి చేకూర్చే ప్రభుత్వానికి ఓటు వేయాలని విజ్ఞప్తి చేస్తామన్నారు. జగన్ వల్లే సంక్షేమ పథకాలతో పేదలు అభివృద్ధి చెందుతున్నారని చెప్పారు. సంక్షేమం, అభివృద్ధి, రాష్ట్ర ప్రగతి, మహిళలకు భద్రత, అవినీతి రహిత ప్రభుత్వం కావాలంటే జగనే రావాలని నినదిస్తామని వారు పేర్కొన్నారు. విజయవాడ సభకు వెళ్లిన వారిలో మండల పార్టీ అధ్యక్షులు అన్యెం కృష్ణ, ఏఎంసీ చైర్మన్ రసూల్‌బీబీ, నగర పంచాయతీ వైస్‌చైర్మన్లు పుప్పాల పండు, వంగా జ్యోత్స్న, ఎంపీపీ కఠారి జయలక్ష్మీ, వైస్ ఎంపీపీలు సైదాల సూర్యనారాయణమూర్తి, కిల్లి రామకృష్ణ, చిక్కాల చిన్నా, కఠారి కేశవరావు, ఎస్కే హుస్సేన్, కేశిరెడ్డి దిలీప్ తదితరులు తరలివెళ్లారు.



విజయవాడ సమావేశంలో పాల్గొన్న ఆకివీడు ప్రతినిధులు

జాతీయ పోటీల్లో ఎస్‌ఆర్‌కేఆర్ విద్యార్థినికి ప్రథమస్థానం



విద్యార్థిని జయశ్రీని అభినందిస్తున్న దృశ్యం

సాక్షి, భీమవరం: జాతీయ స్థాయిలో జరిగిన మాస్టర్ ఒరేటర్ చాంపియన్‌షిప్ ఇంగ్లిష్ స్పీకింగ్ కాంపిటిషన్‌లో తమ కళాశాల విద్యార్థిని ఆముదాలపల్లి జయశ్రీ ప్రథమ స్థానంలో నిలిచిందని ఎస్‌ఆర్‌కేఆర్ ఇంజినీరింగ్ కళాశాల డైరెక్టర్ డాక్టర్ ఎం.జగపతిరాజు, ప్రిన్సిపాల్ కేవీ మురళీకృష్ణంరాజు చెప్పారు. సోమవారం విద్యార్థినిని కళాశాలలో అభినందించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. ఈ నెల 9న హైదరాబాద్‌లోని ఇండియన్ స్కూల్ ఆఫ్ బిజినెస్‌లో నిర్వహించిన పోటీలలో ఆంధ్రప్రదేశ్‌తో పాటు ఇతర రాష్ట్రాల నుంచి 126 మంది విద్యార్థులు ఈ పోటీలో పాల్గొనగా తమ కళాశాల నుంచి జయశ్రీ పాల్గొని మొదటి స్థానంలో నిలిచి విలువైన ల్యాప్‌టాప్‌ను బహుమతిగా అందుకుందన్నారు. కళాశాల ఇంగ్లిష్ అండ్ ఫారిన్ లాంగ్వేజెస్ హెడ్ బీహెచ్‌వీఎస్ లక్ష్మి, చంద్రశేఖర్, ఎల్.కరుణాకర్ పాల్గొన్నారు.

నేడు వాండ్రంలో గడపగడపకు మన ప్రభుత్వం

ఉండి: ప్రజారోగ్య సంరక్షణకు రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం వాండ్రం గ్రామ పంచాయితీ కార్యాలయం వద్ద మంగళవారం ఉదయం 9.30 గంటలకు నిర్వహిస్తున్నట్లు వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు పీవీఆర్‌కే ఆంజనేయరాజు తెలిపారు. ఈ కార్యక్రమానికి మండల పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు హాజరుకావాలని కోరారు.

గడ్డివామి దగ్ధం

ఆకివీడు: గుమ్ములూరు గ్రామంలోని సోమవారం జరిగిన అగ్ని ప్రమాదంలో కొప్పాడ రామకృష్ణకు చెందిన ఐదు ఎకరాల గడ్డివామి సోమవారం దగ్ధమైంది. స్థానికులు సమాచారం అందించగా, అగ్నిమాపక అధికారి వై.నాగేశ్వరరావు, సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపులోకి తీసుకువచ్చారు. ఈ ప్రమాదంలో రూ. 20 వేలు నష్టం వాటిల్లిందని నాగేశ్వరరావు చెప్పారు. కాల్చి పారేసిన సిగరెట్ వల్ల నిప్పు రాజుకుని మంటలు చెలరేగి ఉంటాయని భావిస్తున్నారు.

స్పందనలో 8 ఫిర్యాదులు

ఆకివీడు: స్పందన కార్యక్రమంలో ఎనిమిది ఫిర్యాదులు అందినట్లు ఎంపీడీఓ కందుల వాణి సోమవారం చెప్పారు. ఆయా ఫిర్యాదులను పరిష్కారం నిమిత్తం సంబంధిత శాఖల అధికారులకు బదలాయించామని తెలిపారు. స్పందన కార్యక్రమంలో పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

యువతి అదృశ్యంపై కేసు నమోదు

భీమవరం అర్బన్: భీమవరం రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఓ యువతి అదృశ్యంపై పోలీసులు సోమవారం కేసు నమోదు చేశారు. వారు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. తోకతిప్ప గ్రామానికి చెందిన 19 సంవత్సరాల యువతి ఈ నెల 8వ తేదీ సాయంత్రం 5 గంటలకు ఇంటి నుంచి అదృశ్యమైంది. కటుంబ సభ్యులు, బంధువులు, స్నేహితుల ఇళ్ల వద్ద వెతికినా ఆమె ఆచూకీ తెలియలేదు. తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు హెడ్ కానిస్టేబుల్ పి.మహేశ్వరరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ముత్యాలమ్మ ఆలయంలో సంప్రోక్షణ పూజలు

తాడేపల్లిగూడెం రూరల్: దేవీ శరన్నవరాత్ర మహోత్సవాలను పురస్కరించుకుని మండలంలోని ముత్యాలంబాపురం శ్రీముత్యాలమ్మ వారి దేవస్థానంలో సోమవారం సంప్రోక్షణ పూజలు నిర్వహించారు. ఆలయ కార్యనిర్వహణాధికారి పి.హరేరాంప్రసాద్ పర్యవేక్షణలో ఆలయ పండితులు 108 కలశాలకు పూజలు జరిపించారు. ఆ కలశాలతో విద్యార్థినులు, మహిళలు, చిన్నారులు పాత ఆలయం, కొత్త ఆలయం చుట్టూ ప్రదక్షిణ చేసి, గ్రామంలో పర్యటించారు. అనంతరం ఆలయ ప్రాంగణాన్ని శుద్ధి చేశారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం జూనియర్ అసిస్టెంట్ హరిబాబు, మాకా శేషగిరి రావు దంపతులు, ఆలయ అర్చకులు, సిబ్బంది, ధర్మకర్తల మండలి సభ్యులు పాల్గొన్నారు.

డ్రెయిన్‌లోకి దూకేందుకు వ్యక్తి యత్నం.. కాపాడిన సీఐ

సాక్షి, భీమవరం: ఆత్మహత్యకు పాల్పడేందుకు డ్రెయిన్‌లోకి దూకేందుకు ప్రయత్నించిన ఓ వ్యక్తిని ట్రాఫిక్ సీఐ జి.దాసు కాపాడిన ఉదంతమిది. పట్టణంలోని ప్రకాశంచౌక్ సెంటర్ వద్ద సోమవారం ఓ వ్యక్తి యనమదుర్రు డ్రెయిన్‌లోనికి దూకేందుకు ప్రయత్నించగా అదే సమయంలో అటుగా వెళుతున్న సీఐ దాసు అతని ప్రవర్తనపై అనుమానంతో తన మోటారుసైకిల్‌ను పక్కనపెట్టి అతడ్ని అడ్డుకుని కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. వ్యక్తి ఈ ఘటనకు సంబంధించి ఇంకా వివరాలు తెలియాల్సి ఉంది.